ప్రజాశక్తి
గురువారం 23 నవంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు



తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి -అనంతగిరి : అనంతగిరి ఘాట్ రోడ్ శివలింగపురం ఒకటవ నెంబర్ మలుపు తోటవలస సమీపంలో ఆగి ఉన్న ఆటోను టవేరా ఢీకొట్టిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. అరకు మండలం ఎం.అట్టగుడ గ్రామానికి చెందిన ఆటో ఎస్.కోటలో ధాన్యం మిల్లులో వెళ్లి పని పూర్తి చేసి తిరిగి వస్తూ, భోజనం చేసేందుకు రోడ్డు పక్కన ఆపిన సమయంలో, పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చి తిరుగుప్రయాణంలో టవేరా ముందు టైరు పంచర కావడంతో అదుపు తప్పి ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోఆటో ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. ఆటోలో ఉన్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా, ప్రయాణికులు ఏమీ జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు



ఘాట్ రోడ్‌లో ఆటోను ఢీ కొట్టిన టవేరా

పారదర్శకంగా కాఫీ కొనుగోలు

25 నాటికి రైతులకు బకాయిల చెల్లింపులు
మోసగిస్తే కఠిన చర్యలు తప్పవు : కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన రైతుల నుండి కాఫీ కొనుగోలు చేస్తున్న వ్యాపార సంస్థలు, దళారులు రైతులను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. కాఫీ కొనుగోలులో పారదర్శకత, నిజాయితీ ఉండాలన్నారు. చింతపల్లి ఎకోపల్పింగ్ యూనిటుకు కాఫీ పళ్లను విక్రయిస్తున్న రైతులకు ఈనెల 25 వ తేదీలోగా చెల్లింపులు పూర్తి చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాఫీ, హార్టీకల్చర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ. కాఫీ రైతుల నుండి ఇప్పటి వరకు 342 మెట్రిక్ టన్నులు కాఫీ పళ్లను సేకరించారన్నారు. 200 మెట్రిక్ టన్నుల కాఫీకి రైతులకు సుమారు రూ.కోటి చెల్లించారని, మిగిలిన 142 మెట్రిక్ టన్నులకు చెల్లింపులు చేయాలని ఆదేశించారు. కాఫీ రైతులకు. అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు. గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేస్తున్న కాఫీ రైతుల వివరాలు సేకరించాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. రైతులు తమ కాఫీ ఉత్పత్తులను దళారులకు విక్రయించ కూడదని సూచించారు.కాఫీ పళ్లను సేకరించడానికి అవసరమైన గోనె సంచులను కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ అరకు వ్యాలీ నుంచివర్చువల్ విధానంలో పాల్గొన్నారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ ఎం.వేంకటేశ్వరరావు, కాఫీ బోర్డు డిడి రమేష్, కాఫీ సహాయ సంచాలకులు ఎన్.అశోక్, ఉద్యానవన శాఖ ఉప సంచాలకులు పి.రమేష్‌కుమార్‌రావు, 11 మండలాల హార్టీకల్చర్ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం రైతుల దిగులు!

◆ అకాల వర్షంతో తడిసిన వరి చేను, పైర్లు
◆ పంట సంరక్షణకు అన్నదాతల అష్టకష్టాలు



హుకుంపేటలో చేను కుప్పల కిందకు చేరి నిల్వ ఉన్న వర్షపునీరు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, ద్రోణిల ప్రభావంతో బుధవారం పాడేరు మన్యం అంతటా ముసురు వాతావరణం నెలకొంది. రెండు రోజులుగా ఆకాశం మేఘావతమై ఉంది. మంగళవారం పలు మండలాల్లో చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసింది. చేతికి అంది వచ్చిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు సాగుదారులు అష్ట కష్టాలు పడుతున్నారు. ఇపుడిపుడే వరికోతలు మొదలెట్టిన రైతన్నలు, చేను తడిసిపోకుండా సంరక్షించేందుకు నానా తంటాలు పడుతున్నారు. పొలాల్లో కోసిన చేను తడిసిపోకుండా, తడిపనలను అక్కడికక్కడే చిన్నకుప్పలు పెట్టి టార్పాలిన్లు కప్పుతున్నారు.. మరోవైపు కోతకు వచ్చి వరిపైరు చిరుజల్లులకు తడిసి వెన్ను బరువై, ఇదే సమయంలో వీచిన గాలులకు నేలవాలుతోంది. ఇప్పటికే నూర్చిన ధాన్యం రాశులను వర్షానికి తడవకుండా బరకాలతో కప్పేందుకు నానా తంటాలు పడుతున్నారు.

కూలీల కొరతతో కష్టాలు రెట్టింపు

కోసిన వరి పనలను కుప్పలు వేయాలన్న, ధాన్యం ఆరబెట్టాలన్న, కళ్లాలకుగానీ, ఇళ్లకు గానీ తరలించాలన్న సమయానికి కూలీలు దొరకలేదు. జిల్లాలోని పలు గ్రామాల్లో కోతలు పూర్తవడంతో పంటను దాచుకునేందుకు, వరి కుప్పలు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు ఎంతగా ఆరాటపడుతున్నప్పటికీ, రెండు రోజులుగా కురుస్తున్న చిరు జల్లులకు పొలాల్లో వరి పనులు, వేసిన చేను కుప్పలు, నూర్చిన ధాన్యం రాశులు తడవకుంఠ సంరక్షించడం రైతులకు తలకుమించిన పని కావడంతో లబోదిబో మంటున్నారు. సీజన్ పొడుగునా కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాను కారణంగా ఇలా నష్టం జరుగుతుండడంతో ఏర్పడిందని రైతులు దిగులు చెందుతున్నారు. ప్రభుత్వమే అండగా నిలిచి, ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. 24వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి పైరు కోతలకు సిద్ధమైన రైతులు వాయిదా వేసుకుంటున్నారు.



పాడరులో పొలాల్లోనే తడిసిపోయిన కోసిన వరిచేను

హుకుంపేట: అకాల వర్షంతో మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ పెదగరువు గ్రామంలో కల్లాల్లోని వరికుప్పలు తడిసిపోవడంతోపాటు కిందకు నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసిన వరిచేనును చిరుజల్లులు కురుస్తుండడంతో ఆదరాబాదరగా కుప్పలు వేసిటార్పాలిన్లు కప్పిన రైతులు, ఇపుడు చేను కుప్పల కిందకు నీరు చేయడంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. మంగళవారం వీడకుండా కురిసిన వర్షానికి ఇప్పటికే పొలాలన్నీ తడిసిపోగా, కల్లాలు చిత్తడిగా మారాయి. కుప్పల కింద నీరు గుమ్ములుగా నిలిచిపోయింది. బుధవారం జల్లులు కురవడం తగ్గినా, ఎండ కాయకపోవడంతో పొలాలు, కల్లాల్లోని నీరు ఎండని పరిస్థితి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం తెరిపినివ్వక పోవడంతో అన్నదాతల్లో ఆందోళన కొనసాగుతోంది.

వర్షానికి కూలిన పెంకుటింటి గోడ



ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలో మంగళవారం కురిసిన వర్షానికి రంగిలిసింగి పంచాయతీ కింజెరు గ్రామానికి చెందిన పాంగి సిద్దేశ్వరరావు అనే నిరుపేద గిరిజనుడికి చెందిన పెంకుటిల్లు గోడ కూలిపోయింది. తలదాచుకోవడానికి ఉన్న ఇంటి గోడ కూలిపోవడంతో, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానికసిపిఎం నాయకుడు పి మోహన్‌దాస్ గ్రామంలో సందర్శించి, గోడ కూలిన ఇంటిని పరిశీలించి, బాధితుడిని పరామర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం



డంప్‌లో లభ్యమైన పేలుడు సామగ్రి

ప్రజాశక్తి - సీలేరు

ఆంధ్ర - ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను ఒడిశా పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు.. ఎఒబిలోని మత్తిలి పోలీస్ స్టేషన్ పరిధి కిరిమితి - తులసి అటవీ ప్రాంతంలో బిఎస్ఎఫ్ స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. వారికి ఈ డంపు లభించింది. దేశవాళీ తుపాకీ 1, జిలెటిన్ స్టిక్స్ 150, మందు పాత్రలు 13, వైర్ బండిల్స్ తదితర సామగ్రి ఉన్నాయి. భద్రతా బలగాలు, పౌరులను లక్ష్యంగా చేసుకొని వీటిని మావోయిస్టులు అమర్చారని ఒడిశా పోలీసాధికారులు భావిస్తున్నారు. తాజా ఘటనతో కూంబింగ్‌ను మరింత ముమ్మరం చేశారు.

27, 28 తేదీల్లో కార్మిక, కర్షక మహాధర్నాకు తరలిరండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -పాడేరు: కార్మిక ఉద్యోగ రైతు సంఘాల పిలుపుమేరకు ఈనెల 27 28 తేదీల్లో నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్మిక, రైతు మహాధర్నాకు తరలి రావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం పాడేరు సిఐటియు కార్యాలయంలో అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ పోతురాజు అధ్యక్షతన నిర్వహించిన సిఐటియు అల్లూరి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, దేశానికి వ్యతిరేకమైన వినాశకర కార్పొరేటు అనుకూల చర్యలను దూకుడుగా అమలు చేస్తోందని మండిపడ్డారు. కార్మిక కోర్కెల పరిష్కారం కోసం ఏటా కనీసం ఒకసారి జరగాల్సిన త్రైపాక్షిక భారత కార్మిక మహాసభను మోడీ ప్రభుత్వం 2015 నుంచి జరపడం లేదన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్ ను పునరుద్ధరించాలని ఉద్యోగులు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుంటే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుకమిటీల పేరుతో కాలయాపన చేస్తుంది తప్ప ఒరిగిందం లేదని అన్నారు రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి, తన వాగ్దానానికి విరుద్ధంగా సిపిఎస్‌కు ప్రత్యామ్నాయంగా జిపిఎస్ చట్టం తెచ్చి మోసపచ్చిందన్నారు., కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులను నిర్ణీత కాలపరిమితి ఉద్యోగాల పేర్లతో పర్మినెంట్ చేయకపోవడం దారుణమన్నారు మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు పన్నులను తగ్గించి, ప్రజలపై జిఎస్‌టి భారాలను మోపడం దుర్మార్గమన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో కార్పొరేట్ కంపెనీలకు రూ.14 లక్షల కోట్లు బ్యాంకు బకాయిలను రద్దు చేసిన మోడీ ప్రభుత్వం, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. మోడీ ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వైసిపి జగన్మోహనరెడ్డి అడుగులకు మడుగులొత్తుతూ ప్రజలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు 13 డిమాండ్లతో విజయవాడ జింఖానా మైదానంలో నిర్వహించే మహాధర్నాకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్. జిల్లా కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ. ఉపాధ్యక్షులు కె మొస్యా. కే శంకర్రావు. అంగన్వాడి యూనియన్ నాయకులు పెంటమ్మ పూర్ణిమ కష్ణకుమారి ఆశా వర్కర్ సంఘం నాయకులు మంగమ్మ పార్వతి ప్రసన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి

వైవి.సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి వినతి

ప్రజాశక్తి పాడేరు: పాడేరు ఏజెన్సీలో వివిధ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కోరారు. బుధవారం విశాఖలోని వైసిపి కార్యాలయంలో పార్టీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. పాడేరు మండలం సలుగులో వరికోతలకు వెళుతూ, వ్యాన్ బోల్తా ప్రమాదంలో మృతి చెందిన పూలం నూకరాజు కుటుంబాన్ని, అలాగే చింతపల్లి మండలం అన్నవరం గ్రామంలో అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి గెమ్మిలి నిత్య కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. దీనిపై వైవి సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



వైవి సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భాగ్యలక్ష్మి

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంపై కఠిన చర్యలు



స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న రమణమూర్తి తదితరులు

గురుకుల పాఠశాలలో జాయింట్ సెక్రటరీ రమణమూర్తి విచారణ


ప్రజాశక్తి-రంపచోడవరం

గురుకుల పాఠశాల విద్యార్థులు పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎపి గురుకులం జాయింట్ సెక్రటరీ రమణమూర్తి చెప్పారు. స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో వసతులు సరిగ్గా లేవని ఈ నెల 20వ తేదీన పాఠశాలకు చెందిన విద్యార్థులు ఐటిడిఎను ముట్టడించి, పిఒకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురుకులం సెక్రటరీ బుధవారం పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులు ఫిర్యాదు చేసిన వెంటనే ప్రిన్సిపల్‌ను సరెండర్ చేసి, వైస్ ప్రిన్సిపల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడుగు తెలుసుకోవడం జరిగిందని, ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు విద్య ఎంత అవసరమో పౌష్టికాహారం కూడా అంతే అవసరమని, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, భరత్. రమణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉమర్ అలీషా తదితరులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్, స్కూల్ శానిటేషన్ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-మారేడిమిల్లి

మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, స్కూల్ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన బుధవారం మారేడుమిల్లి మండలం విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కమిటీ సభ్యులు ఈ.సిరిమల్లిరెడ్డి, మధ్యాహ్నం భోజనం, స్కూల్ శానిటేషన్ కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో వైసిపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు, శానిటేషన్ వర్కర్లకు శ్రమకు తగిన వేతనం ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. డిమాండ్లపై శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే పోలీసులతో నిర్బంధాలు ప్రయోగించి నియంత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మధ్యాహ్నం భోజనం, స్కూల్ శానిటేషన్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, పెట్టుబడి బిల్లులు ఇవ్వాలని, ధరలకు అనుగుణంగా విద్యార్థికి మెస్ చార్జీలు రూ.20కు పెంచాలని, ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యాలు కలిపించాలని, యూనిఫారం, వంటపాత్రలు ఇవ్వాలని, నెల వేతనం రూ.10వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. పై సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేలీన, జి.చంద్రమణి, జె.కనకరాజేశ్వరి, వి.సుజాత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మిడ్డే మీల్స్, శానిటేషన్ కార్మికులు

24న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలో కాకినాడ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ ఏజెన్సీ వారిచే ఈనెల 24వ తేదీన శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మారేడుమిల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎ.వీరకిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను నియమించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ : అరకువేలి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు నియమించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను ఆయనక్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.అరకువేలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభించి నాలుగేళ్ల పూర్తి కావస్తున్నపటికీ నేటికి అధ్యాపకులు నియమించ లేదన్నారు. ప్రిన్సిపాల్ ఒక్కరు మాత్రమే ఉన్నారని,సబ్జెక్టులు బోధించే అధ్యాపకులు లేకపోతే చదువు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. సుమారు 600 గిరిజన విద్యార్థినుల భవిష్యత్‌తో ప్రభుత్వం అధికారులు చెలగాటమాడడం దుర్మార్గమన్నారు..సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అధ్యాపకులు, నాన్ టీచింగ్ పోస్టులు నియమించే విధంగా చర్యలుచేపట్టాలని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ స్పందించి, సమస్యను ప్రభుత్వం, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఎస్ ఐసుబాబు, నాయకులు కె శాంతి, ఎస్ సంధ్య, కె కౌసల్య, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పి రామన్న పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపిపి బడుగు రమేష్, హాజరైన ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు

ప్రజాశక్తి-కొయ్యూరు

అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బడుగు రమేష్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని 33 పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. గిరిజనులకు అవసరాల సమయంలో పిహెచ్‌సి నుంచి అంబులెన్స్‌ను ఇచ్చేందుకు రకరకాలు ఇబ్బందులు పెడుతున్నారని, ప్రజా ప్రతినిధులు వెళ్లినా మీకు సంబంధం ఏమిటంటే ప్రశ్నిస్తున్నారని సర్పంచ్‌లు తెలియజేయగా, సరి చేసుకుంటామని వైద్యశాఖ అధికారులు చెప్పారు. కంఠవరం పిహెచ్‌సిలో సిహెచ్‌డబ్ల్యులు, ఆశాలతో నైట్ డ్యూటీలు చేయించడంపై ఎంపీపీ మండిపడ్డారు. ఇకనుంచి అలా జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఏ కార్యక్రమాలు చేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియజేయడం లేదని సర్వనాపాలెం ఎంపీటీసీ గాంధీ ఆరోపించారు. ఈ విషయమై కొంతసేపు సమావేశం రసాభాసగా మారింది. మండలంలోని ఆశ్రమం పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉందని ఆరోపించారు. ఎటిడబ్ల్యుఒ, అగ్రికల్చర్ ఏవో, ఐసిడిఎస్ అధికారి సమావేశానికి హాజరు కాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామరాజుపాలెంలో మంచినీటికి ఇబ్బంది పడుతున్నట్లు సర్పంచ్ చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు ఇవ్వడం లేదని, కుళ్ళిన గుడ్లు పంపిణీ అవుతున్నా పట్టించుకోవట్లేదని ఐసిడిఎస్ పిఒపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీలు, ఆశాల సమస్యలపై వినతి

కొయ్యూరు : మండలంలో అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, జడ్పీటీసీకి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.అప్పలనాయుడు ఆధ్వర్యాన బుధవారం వినత పత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని, పెంచిన పనిభారాన్ని తగ్గించాలని, గ్రాడ్యుటీ ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అంగన్వాడీలు ఎల్ ముత్యాలమ్మ, చి అచ్చియమ్మ, పూర్ణ, ఎం వెంకటలక్ష్మి, బంగారమ్మ, రాజేశ్వరి, అమ్మాజీ, వెంకట రమణ, రత్నం, కళ, పి.సత్య వేణి, డి.వెంకట రమణమ్మ, ఎస్.రమణమ్మ, ఎం దేవుడమ్మ, భారతి, అమ్మాజీ, జీవనజ్యోతి, గిరిజన సంఘం నాయకులు ఎస్. సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిపికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ, ఆశాలు

సుధబాబు ఆశయాలను కొనసాగిస్తాం

ప్రజాశక్తి-ఎటపాక

సిపిఎం చేపట్టిన అనేక ఉద్యమాలు, పోరాటాలలో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేసిన అమరజీవి సుధబాబు ఆశయాలను కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మురుమూరులో సుధబాబు నాల్గవ వర్ధంతి సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఇరప సత్యం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సుధబాబు చిత్ర పటానికి మర్లపాటి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కూలి పోరాటాలు, తునికాకు రేట్ల కోసం జరిగిన పోరాటాలలో సుధబాబు చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. పోలవరం నిర్వాసితుల ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. పార్టీ ఇచ్చిన ప్రతి బాధ్యతను క్రమ శిక్షణతో నిర్వర్తించి పేదలు, కార్మికుల కోసం చివరిదాకా పనిచేశారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి కృషి చేయడమే సుధబాబుకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొందె రామారావు, సోయం వీరమ్మ, అమరవరపు నాగేంద్ర, ప్రసాద్, సోయం పెదబాబు, లక్షణ్, బల్లిపర రాజా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



సుధబాబు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు


ముద్రించిన పోస్టుకార్డులను చూపుతున్న కాంగ్రెస్ నేతలు

గిరిజన సమస్యలపై రాష్ట్రపతికి పోస్టుకార్డులు

ప్రజాశక్తి -చింతపల్లి: నిరుద్యోగ గిరిజనుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని అల్లూరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వంతల సుబ్బారావు అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోఏటా నిరుద్యోగిత పెరగడానికి ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని మండిపడ్డారు. బుధవారం ఆ పార్టీ యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర సూరిబాబు అధ్యక్షతన మండల నాయకుల సమావేశంలో మాట్లాడుతూ, ఆదివాసీ హక్కులు, చట్టాలు తూట్లు పొడుస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నారన్నారు. బోయ/వాల్మీకులను గిరిజన తెగలో చేర్చటం, జిఒ 3 రద్దుపై స్పందించకపోవడం, ఏజెన్సీ ప్రాంతంలో బ్యాక్‌లాగ్ పోస్టులు గిరిజనేతరులకు అప్పగించడం, పోలవరం ముంపు బాధిత గిరిజన కుటుంబాలను విస్మరించడం, ఐదో షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు కాకపోవడం వంటి విషయాలపై సమావేశంలో చర్చించారు. ఆయా సమస్యలను పోస్టుకార్డుపై ముద్రించి, రాష్ట్రపతికి పంపనున్నట్లు వెల్లడించారు కార్యక్రమంలో ఆదివాసీ కోఆర్డినేటర్ వంతల గోపినాధ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షులు కొర్ర మోహనరావు, మర్రి గురుమూర్తి, గెమ్మెల ప్రసాద్, వంతల సత్యనారాయణ, కొర్ర లింగబాబు, వంతల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న టిడిపి నేతలు

'బాబు ష్యూరిటీ'పై బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - డుంబ్రిగుడ: బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కించుమండ నుంచి అరకు లోయ వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర కార్యదర్శి వి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కించుమండలో ప్రారంభమైన బైక్ ర్యాలీలో మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ హాజరయ్యారు. స్థానిక గిరిజన మహిళలు పూలదండలు వేసి బియ్యంతో తిలకదిద్ది బైక్‌యాత్రకు ఘనస్వాగతం పలికారు. గిరిజన సాంప్రదాయమైన డప్పు వాయిద్యాలు, గిరిజన థింసా నృత్యాలతో సందడి చేశారు. కించుమండలో ప్రారంభమైన భారీ బైక్ ర్యాలీ మండల కేంద్రం మీదుగా అరకు సంత బయలు నుంచి అరకులోయ వరకు సాగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రావణకుమార్ మాట్లాడుతూ, టిడిపి అధికారంలోకి వస్తేనే, రాష్ట్రానికి మనుగడ, ప్రజలకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, పార్లమెంట్ ఎస్టీ సెల్ కార్యదర్శి కె సుబ్బారావు, జనసేన నాయకులు లక్ష్మణ్, రాందాస్, పార్లమెంట్ కార్యనిర్వాహక సభ్యులు ప్రశాంత్, చిరంజీవి ,సురేష్, లక్ష్మణ్, టిడిపి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫలించిన తరాల నాటి పోరాటం

- ఎట్టకేలకు పంచగ్రామాల అపరిష్కృత రెవెన్యూ సమస్య పరిష్కారం
- గాడ్‌గూడ, బిస్టాం గూడ, డొల్లిగూడ రైతులకు పట్టాల పంపిణీ
- కలెక్టర్ సుమిత్‌కుమార్, పిఒ అభిషేక్‌లకు సర్పంచ్ దాసుబాబు కృతజ్ఞతలు


పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పిఒ, సర్పంచ్

ప్రజాశక్తి-అరకులోయ :స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి చేస్తున్న పోరాటమది. ఎన్నో ప్రభుత్వాలకు, అనేకమంది నాయకులకు విన్నవించినా పరిష్కారం గాని రెవెన్యూ సమస్య అది. తరతరాలపాటు తమ భూమికి హక్కులు కల్పించాలని పోరాటం చేసిన ఆ రైతుల కల నేటికి ఫలించింది. పెదలబుడు పంచాయతీ పరిధిలో ఉన్న అపరిష్కృత రెవెన్యూ పంచ గ్రామాల సమస్యకు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు ఆధ్వర్యంలో చేసిన పోరాటం ఫలించింది. అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పిఒ సంయుక్త చొరవతో ఆ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. సర్పంచ్ దాసుబాబు వినతి మేరకుకలెక్టర్ సుమిత్ కుమార్ ఆ సమస్య పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపించారు. ఐదు గ్రామాల రైతులు సాగు చేసుకుంటున్న భూములను సర్వే చేయించి పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అందులో తొలి దశ పట్టాల పంపిణీ బుధవారం పెదలబుడు పంచాయతీలో నిర్వహించారు. తొలి దశలో మూడు గ్రామాలకు చెందిన 89 మంది గిరిజన రైతులకు ఈ పట్టాలను అందించారు. పెదలబుడు పంచాయతీ పరిధిలోని డొల్లి గూడ, గాడ్ గూడా, బిష్టంగూడ గ్రామాల భూములకు ఐటిడిఎ పిఒ అభిషేక్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గొణ, సర్పంచ్ పెట్టెలి దాసు బాబు పట్టాలను అందించారు.మిగిలిన రెండు గ్రామాలు లింబగూడ, నువ్వగూడ, రైతులకు మరో నెల రోజుల్లో పట్టాల పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లు పోరాడుతున్న సమస్యకు పరిష్కారం చూపిన కలెక్టర్ సుమిత్ కుమార్‌కు, ఐటీడీఏ పీవో అభిషేక్ ఐదు గ్రామాల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బాబు మాట్లాడుతూ, తాను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి అపరిష్కృత రెవెన్యూ పంచ గ్రామాల సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నానన్నారు. అనేకసార్లు ఉమ్మడి విశాఖలోనూ, ఇపుడు అల్లూరి జిల్లాగా ఏర్పాటైన తర్వాత ఐదు గ్రామాల రైతులను వెంటబెట్టుకొని సమస్యలపై పదేపదే విన్నవించానన్నారు. ఎట్టకేలకు అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ అభిషేక్ దృష్టికి ఈ పంచ గ్రామాల సమస్యను విన్నవించిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చి దాన్ని సాకారం చేశారని ఆనందం వ్యక్తం చేశారు.. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, విఆర్ఓ పవన్, ఎంపిటిసిలు భీమ్ రాజు, శత్రుఘ్న, ఉప సర్పంచ్ చందు విజయ్ నిర్మల, వార్డు సభ్యులు త్రినాథ్, భగత్ రాం, టిడిపి నాయకుడు కిల్లో నాగరాజు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-పెదబయలు: గిరిజన రైతులు తాము సాగు చేస్తున్న భూములకు శాశ్వత యాజమాన్య హక్కు కల్పించి, పట్టాలను అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందని ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూహక్కు పట్టాలను తహసీల్దార్ సిహెచ్ కృష్ణారావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫాల్గుణ మాట్లాడుతూ నవరత్నాల్లో ఒకటైన రైతులకు శాశ్వత భూహక్కు కల్పించే హామీని ప్రభుత్వం నెరవేర్చిందని, వీటి ద్వారా ఇతర సంక్షేమ లబ్ధిని రైతులు పొందవచ్చన్నారు. అరెమెరా గ్రామంలో 50, కుతంగిపుట్టులో 70 తోరంగులలో 33, పెదవంచ రంగిలో 45, బూరుగువీధిలో 31, జాముదాలలో 96, పులుసు మామిడిలో 49 మందికి పట్లాను పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మండలంలో 72 గ్రామాల్లో భూసర్వే పూర్తయిందని, మరో 200 గ్రామాల్లో చేయాల్సి ఉందన్నారు. అనంతరం జిసిసి బ్రాంచి మేనేజర్ ఓలేసు గాసి ఆధ్వర్యంలో ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు కార్యక్రమంలో వైసిపి రాష్ట్రకార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, ఎంపిడిఒ ఎల్ పూర్ణయ్య, డిటి రంగారావు, ఎంపిపి బోండా వరహాలమ్మ, జెడ్‌పిటిసి కె,బొంజుబాబు వైస్ ఎంపిపి కొర్ర రాజుబాబు ఆర్ఐ రిమెలి సింహాచలం, పి కిరణ్ కుమార్, విఆర్ఓ కె సత్యారావు పాల్గొన్నారు

పేదల ఆరోగ్యానికి సురక్ష : ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ

అరకులోయ రూరల్: పేదలకు ఆరోగ్య పరిరక్షణ కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ అన్నారు. బుధవారం స్థానిక సచివాలయ ఆవరణలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి, అభిషేక్‌తో కలిసి ప్రారంభించారు. అర్హులైన గిరిజనులకు జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పట్టాలు పంపిణీ చేశారు. పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, ఎంపిటిసి ఎల్ భీమరాజు, సమర్డి శత్రుఘ్న, వైస్ ఎంపీపీ రామన్న, తహశీల్దార్ వేణుగోపాల్, ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, విఆర్ఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డు ప్రయాణంలో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -అనంతగిరి : ఏజెన్సీలోని ఘాట్‌రోడ్డులో వాహనాలను నడిపేటప్పుడు అప్రమత్తతతో వ్యవహరించాలని ఎస్ఐకె.రాము సూచించారు. బుధవారం చిలకగెడ్డ పంచాయితీ అరుకు మెయిన్ రోడ్డులో వాహన డ్రైవర్లకు, స్థానిక ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా లో అనంతగిరి, అరకు మండలాలలో పర్యాటక కేంద్రాల సందర్శనకు దేశవిదేశాలనుంచి నిత్యం అధికసంఖ్యలో సందర్శకులు వస్తుంటారని, ఘాట్‌రోడ్డులో వాహనాలను నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యముగా బొర్రా, ములియగుడ, డమ్మకు ఘాట్‌రోడ్డులో వెళ్లేటప్పుడు మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక వేగం, పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణం ప్రమాదకరమని హెచ్చరించారు.

30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

జిల్లాలో 46 ధాన్యం, 25 రాగుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
ధాన్యం క్వింటా రూ.2183, రాగులుకు రూ.3846 మద్దతు ధర
జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి లక్ష్యంగా నిర్దేశించామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేసారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ వ్యవసాయాధికారులతో భౌతికంగాను, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని అధికారులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 46 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 25 రాగుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. వరికి క్వింటాకు రూ.2183 లు, రాగులకు రూ.3846 లు మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 30 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం, 5 వేల మెట్రిక్ టన్నుల రాగులు కొనుగోలు చేయడానికి లక్ష్యం నిర్దేశించామన్నారు. వ్యవసాయాధికారులు నిర్దేశించిన లక్ష్యాలు సాధించడానికి కషి చేయాలని సూచించారు. లక్ష సాధనలో మండల వ్యవసాయాధికారులు చురుకైన పాత్ర పోషించాలని చెప్పారు. ధాన్యం సేకరించిన తరువాత సకాలంలో ఎఫ్‌టిఒ జనరేట్ చేయాలని స్పష్టం చేసారు. తేమ పన్నెండు శాతం ఉన్న ఆరుదల ధాన్యాన్ని సేకరించాలన్నారు. జిల్లాలో వరి, రాగులు ఎన్ని టన్నులు ఉత్పత్తి జరుగుతున్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 27వ తేదీ నుండి రాగులు కొనుగోలు చేయాలని స్పష్టం చేసారు. వరి కోతలు అనంతరం ధాన్యం సేకరణ చేయాలన్నారు. వరి, రాగులు కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో నూరు శాతం ఇ క్రాప్ బుకింగ్ చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు గోనులు, రవాణా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వర్చువల్ విధానంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, రంపచోడవరం పిఒ సూరజ్ గనోరే, సమావేశంలో పౌర సరఫరాల శాఖ డిఎం. బి.గణేష్, డిఎస్ఒ శ్యామ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బిఎస్. నంద్, పాడేరు, చింతపల్లి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, నేచర్ సంస్థ ప్రతినిధులు గౌరీ శంకర్, సంజీవిని దేవుళ్ళు పాల్గొన్నారు.

35 ఎకరాల్లో గంజాయి తోటల ధ్వంసం

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: ఆంధ్రాఒడిశా సరిహద్దు ప్రాంతంలో గ్రేహౌండ్స్ పోలీసుల సహకారంతో బుధవారం భారీగా గంజాయి తోటలను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు. విలేకరులకు తెలిపిన వివరాలివి. మండలంలోని లక్ష్మీపురం, బుంగాపుట్, బరడ, బాబుసాల, రంగబయలు పంచాయతీలకు చెందిన గడ్డిబంద, తుమ్మిడిపుట్టు, సంగవలస, కొసొంపుట్టు, గునసెల్మ, బొడ్డపుట్, బరడ, దాబుగూడ, కర్లపొదోరు, డెంగచెమిలి, డెంగము, మొంజగూడ, అర్లోయిపుట్, జడిగూడ తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న 35 ఎకరాల్లో గంజాయి మొక్కలను గుర్తించిన తర్వాత గ్రేహౌండ్స్ పోలీసుల సహకారంతో స్థానిక ఎస్ఐ రవీంద్రతో పాటు పోలీసులు కొన్ని కిలోమీటర్ల మేర అటవీ మార్గాల్లో నడిచి వెళ్లి, గంజాయి మొక్కలను నరికి వేశారు, నరికిన గంజాయి మొక్కలు ఒకచోట పోగు చేసి నిప్పంటించి తగలబెట్టారు. కేసుల నమోదుకు పాడేరు ఎస్ఇబి పోలీసులకు తెలిపినట్లు ఎస్సై తెలిపారు. గంజాయి సాగు, రవాణా చట్టప్రకారం నేరమని, పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో స్థానిక పోలీసులు,గ్రేహౌండ్స్ పోలీసులు పాల్గొన్నారు.


గంజాయి తోటలను ధ్వంసం చేస్తున్న ఎస్ఇబి, స్థానిక పోలీసులు



శిక్షణలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ సూర్యమణి

అంగన్వాడీ అభివృద్ధి కమిటీలకు శిక్షణ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని అంగన్వాడీ అభివృద్ధి కమిటీలకు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మండలస్థాయి శిక్షణనిచ్చారు. బుధవారం నిర్వహించిన శిక్షణలో శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్ సూర్యమణి, గిరిజన సంక్షేమ విభాగం జెఇ ధ్రువకుమార్ పాల్గొని శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పీడీ సూర్యమణి మాట్లాడుతూ, మండలంలోని 67అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ముగ్గురు తల్లిదండ్రులతో కూడిన కమిటీ తమ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనాలకు మరుగుదొడ్లు, కరెంటు, తాగునీరు, పెయింటింగ్‌లు ఇతర సౌకర్యాల కలపనకు బాధ్యత వహించాలని సూచించారు.కార్యక్రమంలో సిడిపిఒ సిహెచ్.బాలామణి దేవి, ఎంఇఒ కోడా ఈశ్వరరావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఇఒ కృష్ణమూర్తి

పలు పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఇఒ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని పలు పాఠశాలల్లో ఎంఇఒ కె.కృష్ణమూర్తి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వనుగుమ్మ, అసరడ, పూలబంద, టోంగికోట, బూసిపుట్, సూతిగూడ, గర్రం ఎంపిపి పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎంఇఒ, అక్కడ రికార్డులను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, జగనన్న విద్యా కానుక సరఫరా,టీచర్స్ ఫేషియల్ అటెండెన్స్, విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు, నాడు నేడు పనులు, ఉపాధ్యాయుల పనితీరుపై పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. తనిఖీల్లో సిఆర్‌పిలు హరి, ఎం.అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ సుజిత్ ఆటిజం ఫౌండేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హీలియోస్ హోమియోపతి క్లినిక్, డాక్టర్ సుజిత్ ఆటిజం ఫౌండేషన్ ఐదో వార్షికోత్సవం గురువారం సాయంత్రం ద్వారకానగర్ ఐటిసి ఫార్చ్యూన్ ఎదురుగా ఉన్న వారి కార్యాలయంలో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా బిఎన్ఐ వైజాగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవిటి.రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థాపించిన తక్కువ కాలంలోనే వెయ్యికిపైగా ఆటిజం కేసులను విజయవంతంగా పూర్తి చేయటం ఎంతో గొప్ప విషయమని అన్నారు.ఈ వ్యాధిని నివారించేందుకు తమ వంతు సాయం అందిస్తామని అన్నారు. హీలియోస్ హోమియోపతి క్లినిక్, డాక్టర్ సుజిత్ ఆటిజం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సుజిత్ ఆటిజం నివారణకు ఎంతో కషి చేస్తున్నారని అన్నారు.

నేడే విశాఖలో క్రికెట్ సంబరం

భారత్ - ఆసీస్ మధ్య తొలి టి 20 మ్యాచ్
- స్టేడియం సమీప ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు


మ్యాచ్‌కు సిద్ధమైన పిఎం.పాలెంలోని క్రికెట్ స్టేడియం

ప్రజాశక్తి - పిఎం.పాలెం : విశాఖ.. క్రికెట్ క్రీడా సంబరానికి సిద్ధమైంది. ఇండియా - ఆస్ట్రేలియా జట్ల మధ్య నగరంలోని వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో గురువారం జరగనున్న తొలి టి - 20 మ్యాచ్‌కు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా సుమారు 1500 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు అమర్చారు. షీ టీమ్స్, మఫ్టీ, ట్రాఫిక్ పోలీసులతో పటిష్టమైన నిఘా పెట్టారు. బైకులు, కార్లు పార్కింగ్‌కు వేర్వేరు ప్రాంతాలను కేటాయించారు. ఎసిఎ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్టేడియంలో అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. నగరానికి చేరుకున్న ఇరు జట్లుకూ ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని, ఆస్ట్రేలియాతో ఆడిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఓడిన తరువాత నాలుగు రోజుల్లోనే ఈ టి - 20 సిరీస్ ప్రారంభమవుతోందని ఆయన అన్నారు. ఈ మ్యాచ్ ఫ్యాన్స్‌లో సరికొత్త ఉత్సాహం నింపుతుందని తెలిపారు. మ్యాచ్ సాయంత్రం 7 గంటలకు ప్రారంభమవుతుండగా.. సాయంత్రం 5 గంటల నుంచి ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తామన్నారు.



బౌలింగ్ సాధనలో భారత్ క్రికెటర్లు

విజయంపై భారత్ గురి

ఈ స్టేడియం భారత్ జట్టుకు అచ్చొచ్చిన మైదానం. కానీ ఇదే ఏడాది మార్చిలో జరిగిన భారత్, ఆసీస్ వన్డే మ్యాచ్‌లో టీమిండియా ఓటమి పాలైంది. అంతేగాకుండా ఇటీవల జరిగిన వరల్డ్ కప్ ఫైనల్‌లో కూడా భారత్ ఆసీస్ చేతిలో ఓటమి చవిచూసింది. వీటిని దృష్టిలో పెట్టుకుని టీమిండియా క్రీడాకారులు విజయంపై గురిపెట్టారు.

ట్రాఫిక్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి

ఇప్పటికే ప్రత్నామ్నాయ రోడ్డు మార్గాలను అధికారులు సూచించారు. మ్యాచ్‌తో సంబంధం లేని వాహనదారులు మధురవాడ క్రికెట్ స్టేడియం వైపు ప్రయాణించకుండా వేరే మార్గాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఈ టి - 20 మ్యాచ్‌కు ప్రేక్షకుల తాకిడి ఎక్కువగానే ఉండనుంది. ఈ నేపథ్యంలో ఎటువంటి అపశృతులూ దొర్లకుండా స్టేడియం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్టేడియంలోని అన్ని గేట్ల వద్దా ఎసిపి స్థాయి అధికారులను నియమించారు. అంతర్జాతీయ మ్యాచ్ కావడంతో మూడంచెల భద్రతను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సుమారు రెండు వేల మంది అధికారులు, సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లులో ఉన్నారు. ఏడు గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చే ప్రేక్షకులు సరైన టికెట్లు లేదా ఎంట్రీ పాస్ కలిగి ఉండాలని, నిర్దేశించిన గేట్ల ద్వారా రెండు గంటల ముందుగా స్టేడియంలోకి ప్రవేశించాలని పోలీసు అధికారులు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో బోట్లు కాలిపోయి తీవ్రంగా నష్టపోయిన బాధితులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు పరామర్శించారు. ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతంలో బుధవారం ఉదయం సిపిఎం నాయకులు పర్యటించారు. అక్కడున్న వారిని ఘటన ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బోట్లు కాలిపోయిన యజమానులకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలని, బోట్లపై ఆధారపడి జీవిస్తున్న కలాసీలకు, చిరువ్యాపారులకు భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హార్బర్ ఏరియాలో మెరైన్ పోలీస్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. ఆకతాయిగాళ్ళు, గంజాయి, మందు తాగేవాళ్లు బోటు యజమానులకు సంబంధం లేకుండా బోట్లలో ఉంటున్నట్లు మత్స్యకారులు తెలిపారని అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే అసలైన నేరస్తుడిని వదిలి ఫిర్యాదుదారుడిని పట్టుకొని విచారించడం సరైంది కాదన్నారు. జెట్టీ విస్తరణకు ప్రభుత్వం 152 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు ప్రకటనలకే పరిమితం కాకుండా పనులు ప్రారంభించాలన్నారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీని పెంచాల్సింది పోయి రూ.9 నుంచి రూ.7.50కి తగ్గించేయడం దారుణమన్నారు. ఇప్పటి వరకూ బకాయి పడ్డ డీజిల్ సబ్సిడీ, వేట నిషేధ కాలానికి రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హాల్ టికెట్లు సిద్ధం

ప్రజాశక్తి-రంపచోడవరం

సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1, గ్రూపు2 ఉద్యోగాలు పొందేందుకు శిక్షణ నిమిత్తం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తొలి లెవెల్ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన గిరిజన యువతీ యువకులు ఈనెల 26వ తేదీన మొదట లెవెల్ పరీక్షకు హాజరయ్యే వారికి స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో హాల్ టికెట్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ వైటిసికి వచ్చి సంతకాలు చేసి హాల్ టికెట్లు తీసుకోవాలని సూచించారు.

పేదలకు సంపద పంచడమే ధ్యేయం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆర్థిక వనరులు సృష్టించే పేదలకు సంపద పంచడమే టిడిపి ధ్యేయమని ఆ పార్టీ మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు అన్నారు. మండలంలో ఊట్ల గ్రామపంచాయతీ పరిధిలో సురేష్ బాబు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అమలు చేసే పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థిక వనరులు కొల్లగొట్టి జగన్‌రెడ్డి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఊట్ల సర్పంచ్ ముర్రం లక్ష్మి, యూనిట్ ఇంచార్జ్ బుడిగ రాజేంద్ర వరప్రసాద్, వార్డు మెంబర్లు, సాధికార సారథులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం

ప్రజాశక్తి -కొయ్యూరు : అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని కొయ్యూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్చార్జి సుమర్ల సూరిబాబు పేర్కొన్నారు. మండలంలోని బూదరాళ్ల గ్రామంలో ఆవాస్ దివాస్ వారోత్సవాల్లో భాగంగా హౌసింగ్ అధికారులతో కలిసి ఆవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -సీలేరు : వైసిపి ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి అన్నారు. జీకే వీధి మండలం సీలేరు రైతు భరోసా కేంద్రంలో పనికి పోదాం అనే కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ జగనన్న చేదోడు, రైతు భరోసా, విద్యా కానుక, ఆసరా తదితర పథకాలు ప్రవేశపెట్టి గడపగడపకి అందించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీలేరు సచివాలయం పరిధిలో నాలుగున్నర సంవత్సరాలలో రూ.10 కోట్ల 85 లక్షల పైగా వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందజేసినట్లు చెప్పారు. అనంతరం ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్ దుర్జు, ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి చేతుల మీదుగా జగనన్నే ఎందుకు కావాలి అనే కరపత్రాలను ఆవిష్కరించారు. వైసిపి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి మండల ఇఒపిఆర్‌డి పాపారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గుమస్తా ప్రకాష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, నాయకులు స్వర్ణలత, చిరుపతి వెంకట్రావు, బుజ్జి గణేష్ పాల్గొన్నారు.

బ్లాక్ టికెట్లు విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గురువారం పిఎం.పాలెంలోని ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఇండియా - ఆస్ట్రేలియా టి 20 మ్యాచ్‌కు సంబంధించి బ్లాక్ మార్కెట్‌లో టికెట్లు విక్రయిస్తున్న నలుగురు సభ్యులతో కూడిన ముఠాను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎసిపి త్రినాధుడు ఆధ్వర్యంలోని బృందం పలు ప్రాంతాల్లో నిఘా పెట్టగా వీరు దొరికారు. వారి నుంచి 51 టిక్కెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.